క్లుప్తంగా

ఘన జీవామృతంతో అధిక దిగుబడి

పీలేరు రూరల్ : ఆకుకూరలు, కూరగాయల సాగులో ఘన జీవామృతం వాడకం ద్వారా అధిక దిగుబడి పొందవచ్చునని ఫార్మర్ శాస్త్రవేత్త వై. శకుంతల అన్నారు. ఆదివారం మండలంలోని బోడుమల్లువారిపల్లె వీవో నెంబరు-1 పరిధిలోని మొరవపల్లె గాయత్రి ఎస్‌హెచ్‌జీ ఆధ్వర్యంలో ఘనజీవామృతం తయారీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్‌జీ సిబ్బంది లక్ష్మీ, సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

గర్నిమిట్ట యల్లమ్మకు పూజలు

కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్టలో వెలసిన యల్లమ్మతల్లికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం ఉదయం అమ్మవారికి అభిషేకం, వివిధ రకాల పుష్పాలతో అలంకరణ, ప్రత్యేకపూజలు, మంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం చేపట్టారు. గర్నిమిట్ట పరిసర గ్రామాలకు చెందిన భక్తులు మంగళ వాయిద్యాలతో బోణాలు ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయ ప్రదక్షిణలు నిర్వహించారు. అమ్మవారికి బోణాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

నేడు మద్దయ్యగారిపల్లిలో పల్లెబాట

పెద్దతిప్పసముద్రం: మండలంలోని మద్దయ్యగారిపల్లి పంచాయతీలో సోమవారం పల్లెబాట నిర్వహించనున్నట్లు జేసీఎస్ కన్వీనర్ డ్రిప్ రమణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు.

శ్రీకృష్ణ జన్మాష్టమిని జయప్రదం చేయండి

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం అనపగుట్టలో వెలసిన గోవర్ధగిరిలో వెలిసిన శ్రీ కృష్ణా ఆలయంలో ఈనెల 7న నిర్వహించే శ్రీ కృష్ణ జన్మాష్టమిని జయప్రదం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం స్థానిక ఆలయం వద్ద శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల కరపత్రాలను ఆవిష్కరించారు. రాయలసీమలోనే అతిపెద్ద శ్రీకృష్ణ ఆలయంలో పలు విశేష కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రెడ్డెమ్మకొండపై భక్తుల రద్దీ

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఆదివారం ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు,అభిషేకాలు నిర్వహించారు. సంతనాన్ని ప్రసాదించే చల్లని తల్లిగా ప్రసిద్ధిపొందిన అమ్మవారి ఆలయానికి వేకువజాము నుంచే భక్తుల సందడి మొదలైంది. మహిళలు అమ్మవారి అమ్మవారి ఎదుట సంతాన కోసం వరపడ్డారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరెసారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించారు. ఆలయ మెట్లకు పసుపు, కుంకుమలు, కర్పూర హరతులతో పూజలు నిర్వహించారు.

ఈ-క్రాప్ నమోదు చేసుకోండి



ఈ-క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయాధికారి

నిమ్మనపల్లె : వివిధ రకాల పంటలు సాగుచేసిన రైతులందరూ తమ పంట సాగు వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మురళీమోహన్ తెలిపారు. 2023 ఆర్థిక సంవత్సరం ఖరీఫ్ సీజన్లో వ్యవసాయ, ఉద్యాన పంటలు మండల పరిధిలో 4,173 ఎకరాల్లో సాగుచేయడం జరిగిందన్నారు. 12 సచివాలయాల పరిధిలో ఆర్‌బీకే కేంద్రాల ద్వారా 50శాతానికి పైగా ఇప్పటికే ఈక్రాప్‌లో నమోదు చేశామన్నారు. రైతులందరూ తమ పంట వివరాలు తప్పనిసరిగా ఈ- క్రాప్‌లో నమోదు చేయించుకోవాలన్నారు. ఈక్రాప్ ఆధారంగానే ప్రభుత్వం పంట నష్టం, బీమాసాయం అందించడంతో పాటు పంటదిగుబడులు మద్దతు ధరకు కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు.

స్వచ్ఛమైన నీరు అందించడమే లక్ష్యం



రాజీవ్‌నగర్ కాలనీలో బోరుకు మోటారు ఏర్పాటు చేయిస్తున్న సర్పంచ్ హబీబ్‌బాషా

పీలేరు : పీలేరు గ్రామ పంచాయతీ పరిధిలో ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించడమే లక్ష్యమని సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా అన్నారు. స్థానిక రాజీవ్‌నగర్‌కాలనీలో ఆర్‌వో ప్లాంట్ బోరుకు నూతన మోటారు ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పీలేరు పట్టణంలో ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సహకారంతో దాదాపు 40 ఆర్‌వో ప్లాంట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి రోజూ స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్నట్లు చెప్పారు. ఇంకా అవసరమైన ప్రాంతాల్లో కొత్తగా ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఈవో ప్రసాద్‌రెడ్డి, నాగరాజనాయక్, కాలనీ చిన్న, మునీర్, ఉబేదుల్లా, కుసుమశేఖర్‌రెడ్డి, బోడేషా తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటల సాగుకు సన్నద్ధం

- ముగిసిన వేరుశనగ సాగుసీజన్
- 6054 హెక్టార్లలో ఆరుతడి పంటలు
- సబ్సిడీపై ఉలవల పంపిణీకి ఏర్పాట్లు



ప్రత్యామ్నాయ పంటల సాగు కోసం పొలాలను మరోసారి దుక్కులు చేస్తున్న రైతులు

గుర్రంకొండ: ఈ ఏడాది ఖరీఫ్‌సీజన్‌లో వేరుశనగ పంట సాగుకు గడువు ముగిసింది. వర్షాలు అంతంత మాత్రంగా కురవడంతో నియోజకవర్గంలో 24 శాతం మేరకు వేరుశనగ పంట సాగయ్యింది. సీజన్ ముగియడంతో నియోజకవర్గంలోని రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుకు సన్నద్ధమవుతున్నారు. నియోజకవర్గంలో 6054 హెక్టార్ల విస్తీర్ణంలో ఆరుతడి పంటల సాగుకు సన్నాహాలు చేసుకొంటున్నారు. ఇందుకోసం రైతులు ప్రభుత్వం సబ్సిడీపై పంపిణీ చేసే ఉలవల కోసం ఎదురుచూస్తున్నారు.

ముగిసిన వేరుశనగ పంటసాగు సీజన్

నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఖరీఫ్‌సీజన్ వేరుశనగపంట సాగు గడువు ముగిసింది. సాధారణంగా వర్షాలు బాగా సమృద్ధిగా కురిసే జూన్, జులై, ఆగష్టులో మాత్రమే వేరుశనగ పంట సాగుకు అనుకూలం. ఈ ఏడాది పంటసాగుకు అనుకూల సమయంలో సకాలంలో వర్షాలు కురవలేదు. దీంతో వేరుశనగ సాగు సీజన్ అనుకొని విధంగా ముందుకు సాగలేదు. నియోజకవర్గంలో సగటున నుంచి 24 శాతం మంది రైతులు మాత్రమే ఈసీజన్‌లో వేరుశనగ పంట సాగు చేశారు. మిగిలిన రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుకు సిద్ధం అవుతున్నారు.

ఆరుతడి పంటలపై ఆసక్తి

నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో వేరుశనగ సాగుపోను మిగిలిన 6054 హెక్టార్లలో రైతులు వేరుశనగకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగు చేసుకోవడానికి ఏర్పాట్లు చేసుకొంటున్నారు. వర్షాధారా పంటలైన ఉలవ, కంది, అలసంద, అనప వంటి ఆరుతడి పంటల సాగుపై రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. ఇప్పటికే వేరుశనగ సాగు కోసం పొలాలు దుక్కులు చేసుకొని సిద్ధంగా ఉన్న రైతులు గడువు ముగిసిపోవడంతో పొలాలను మరోసారి దుక్కులు చేసుకొంటున్నారు. ఆరుతడి పంటలను ఆగస్టు నెలాఖరు నుంచి సెప్టెంబర్ 30 వరకు సాగు చేసుకోవడానికి అనుకూలంగా ఉంటుంది. సకాలంలో వర్షాలు కురిస్తే ఈ కాస్తా ఆరుతడి పంటలు సాగు చేసుకోవచ్చని రైతులు అంటున్నారు.

సబ్సిడీపై ఉలవల పంపిణీకి ఏర్పాట్లు

ఖరీఫ్ సీజన్‌లో ప్రత్యామ్నాయ పంటల సాగుకు అవసరమైన ఉలవల పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆరుతడి పంటల్లో అతి తక్కువ ఖర్చు తో రైతుల చేతికందే పంటగా ప్రసిద్ధి చెందిన పంట ఉలవ. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఇప్పటికే ఎంతమేరకు ఉలవులు అవసరమో జిల్లా ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించారు. ఐదురోజుల్లో అన్ని మండలాల్లో సబ్సిడీపై ఉలవులను రైతులకు పంపిణీకి రంగం సిద్ధమైంది.

నియోజకవర్గంలో సాగు విస్తీర్ణం వివరాలు

మండలం పేరు	సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)
గుర్రంకొండ	818
వాల్మీకీపురం	957
కలికిరి	1068
కలకడ	766
కేవిపల్లె	1094
పీలేరు	1351

సకాలంలో వర్షం కురవలేదు



ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు సకాలంలో కురవలేదు. వేరుశనగ పంట సాగు సమయం గడువు ముగిసింది. జూన్, జులై, ఆగష్టునెలల్లో మాత్రమే వేరుశనగ సాగుకు అనుకూలం. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవడానికి ఇదే అదను. మరోసారి పంటలను దుక్కులు చేసుకొని పంటసాగుకు ఏర్పాట్లు చేసుకొంటున్నాం. **-కృష్ణవేణి, సీకే పల్లె**

ఉలవ పంట సాగు



వేరుశనగ పంట సాగు సీజన్ గడువు ముగిసింది. వర్షాలు లేకపోవడంతో ఆరుతడి పంటలు సాగు చేసుకోంటాం. ఇందు కోసం అవసరమైన ఉలవలను సబ్సిడీపై ప్రభుత్వం సరఫరా చేస్తోంది. సబ్సిడీ ఉలవలు త్వరగా పంపిణీ చేస్తే రైతులకు ఉపయోగం. ఇప్పుడు వర్షాలు కురిస్తే ఉలవ పంట సాగు చేసుకోవచ్చు. **– రెడ్డెప్ప, కొత్తపల్లె**

ప్రతిపాదనలు పంపాం



ప్రత్యామ్నాయ పంటల సాగు కోసం అవసరమైన ఉలవలను సబ్సిడీపై రైతులకు పంపిణీ చేయడం కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. వారం రోజుల్లోగా ఉలవలు ఆర్బీకేలకు చేరుతాయనే సమాచారం ఉంది. ప్రభుత్వం నుంచి ఉలవల స్టాకు రాగానే రైతులకు పంపిణీ చేస్తాం. **- రత్నమ్మ, ఏఓ, గుర్రంకొండ**

ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా చూడాలి

– ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ గోపాలకృష్ణ

వాల్మీకిపురం: ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులు, సిబ్బందిపై ఉందని ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ గోపాలకృష్ణ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో తహసీల్దార్ ఫిరోజ్ ఖాన్‌తో కలసి పర్యటించి, ఓటర్లతో మాట్లాడి జాబితాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబితాలో మృతులు ఉంటే తొలగించాలన్నారు. అలాగే అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కలిగించాలన్నారు. అక్రమ ఓట్లు ఉంటే తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, బిఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడిగా ప్రభుచరణ్



వాల్మీకిపురం: అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా వాల్మీకిపురంకు చెందిన ప్రభుచరణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ఆదివారం రాయచోటిలో జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడిగా వాల్మీకిపురంకు చెందిన ప్రభుచరణ్, ప్రధాన కార్యదర్శిగా రాయచోటి పట్టణానికి చెందిన ప్రకాష్ రెడ్డిని ఎన్నుకున్నారు. జిల్లా కమిటీలో ముగ్గురు గౌరవ అధ్యక్షులు, కోశాధికారి, ఆరుగురు ఉపాధ్యక్షులు, ఆరుగురు కార్యదర్శులు నియమితులయ్యారు. నూతన అధ్యక్షుడు ప్రభుచరణ్ మాట్లాడుతూ సమాజంలో పేరుకుపోయిన మూఢ నమ్మకాలను పారద్రోలి ప్రజల్లో సైన్సుపై అవగాహన కల్పించేందుకు జనవిజ్ఞాన వేదిక కృషి చేస్తోందన్నారు. విద్య, వైద్యం, ఆరోగ్యం, సామాజిక అంశాలపై నిరంతరంగా కృషి చేస్తోందన్నారు.

సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోండి

ఎమ్మెల్యే నవాజ్‌బాషా



సీఎం సహాయనిధి లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : ముఖ్యమంత్రి సహాయనిధిని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఆకాంక్షించారు. మదనపల్లె నియోజకవర్గంలో సీఎం సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్న పలు లబ్ధిదారులకు ఎమ్మెల్యే కార్యాలయంలో చెక్కులను పంపిణీ చేశారు. రూ.20 లక్షల 28వేల నిధుల చెక్కులను అందజేశారు. పట్టణంలోని బుగ్గకాలువకు చెందిన మండ్లకృష్ణమూర్తికి రూ.4 లక్షలు, కోటవీధికి చెందిన వయకర్.మహేష్‌రావుకు రూ.2లక్షల 50వేలు, బర్మావీధికి చెందిన నరసింహారెడ్డికి రూ.2 లక్షల10వేలు, కోళ్లబైలు బాబూకాలనీకి చెందిన పఠాన్ అమీర్‌ఖాన్‌కు రూ.1లక్ష 60వేలు, అప్పారావు వీధికి చెందిన ఎం.ఎస్.హబీబుల్లాకు రూ.1లక్ష40 వేలు, రామసముద్రం మండలం మూగవాడికి చెందిన పి.కేశవరెడ్డికి రూ.1లక్ష30 వేలు, కోళ్లబైలుకు చెందిన దేశిరెడ్డివెంకటరెడ్డికి రూ.1లక్ష, పోతబోలు తురకపల్లెకు చెందిన షేక్‌జబ్బార్‌కు రూ.90వేలు, దేవళంవీధికి చెందిన ఆర్.ఎం.తహసీన్‌కు రూ.90 వేలు, రామసముద్రం మండలం ఎలవానెల్లూరుకు చెందిన మాలూరుగోపాల్‌రెడ్డికి రూ.90వేలు, నెహ్రూనగర్ షేక్‌సాజిద్‌కు రూ.7 5వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవాజ్‌బాషా మాట్లాడుతూ మహానేత డాక్టర్.వైఎస్.రాజశేఖర్‌రెడ్డి పేదవాడికి వైద్యం ఉచితంగా అందించాలనే ధ్యేయంతో ఆరోగ్యశ్రీ, ఆపదసమయాల్లో ఆదుకునేందుకు 108 సర్వీసులను ప్రవేశపెట్టారన్నారు. మహానేత తనయుడిగా సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు మరింత మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా గతం కంటే భిన్నంగా మంచి మౌలికవసతులు ఏర్పాటు చేశారన్నారు. పూర్తిస్థాయిలో వైద్యసిబ్బందిని నియమించి, పేదవాడికి ఆరోగ్యవిషయమై ఏకష్టం వచ్చినా ఆదుకునేందుకు అన్ని చర్యలు తీసుకున్నారన్నారు. ఆరోగ్యశ్రీలో వైద్యసేవలను కేవలం ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే కాకుండా హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర మహానగరాల్లోనూ రాష్ట్రప్రజలు పొందేందుకు వీలు కల్పించారన్నారు. ఆరోగ్యశ్రీ కింద అందే చికిత్సల సంఖ్య టీడీపీ ప్రభుత్వంలో 1,000 ఉంటే, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 3,255కి పెంచారన్నారు. శస్త్రచికిత్స తర్వాత విశ్రాంతి కాలానికి ఆరోగ్య ఆసరా పథకం కింద రోగికి ఇవ్వాల్సిన డబ్బును డిశ్చార్జి రోజే అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేనట్టుగా ఏపీలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సీఎం జగన్ మోహన్‌రెడ్డి అమలుచేస్తూ.. పేదవాడు వైద్యం కోసం రూపాయి ఖర్చు చేసే అవసరం లేకుండా బాగుచేసి పంపే బాధ్యతను తీసుకున్నారన్నారు. జనం ఆరోగ్యమే జగనన్న ఆశయంగా ముందుకెళుతున్నారని, ప్రజాసంక్షేమం కోసం నిత్యం పరితపించే ముఖ్యమంత్రిని మళ్లీ అధికారంలోకి తీసుకురావాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, గుండ్లూరురఫీ, కౌన్సిలర్ వసీం, ఎస్వీ.రమణ, సీఎం సహాయనిధి లబ్ధిదారులు పాల్గొన్నారు.

గో మహాలక్ష్మికి సీమంతం



గోవుకు సంప్రదాయం ప్రకారం సీమంతం నిర్వహిస్తున్న ఉమాదేవి, బంధుమిత్రులు

మదనపల్లె : భారతీయ సంస్కృతిలో ఆవుకు విశిష్ట స్థానం ఉంది. గోవులను శుభానికి సూచికగా, శ్రీ మహాలక్ష్మి స్వరూపంగా భావిస్తాం. ఆవు ఉన్న ఇంట ఆనందం, ఆరోగ్యం ఉంటాయనేది నానుడి. గతంలో పాడి, పంటకు సమ ప్రాధాన్యత ఉండేది. రైతు ఇంట్లో గోమాతలు కుటుంబసభ్యులుగా కలియతిరిగేవి. ఆనాటి రోజులు మళ్లీ రావాలని, ఆవుల సంరక్షణ, ప్రాధాన్యత అందరికీ తెలియాలని కాంక్షిస్తూ అన్నమయ్యజిల్లా మదనపల్లె మండలం ఇసుకనూతిపల్లెకు చెందిన ఉమాదేవి అంగరంగ వైభవంగా ఆవుకు ఆదివారం సీమంతం చేశారు. బంధుమిత్రులు, చుట్టుపక్కల అతిథులను ఆహ్వానించారు. పండ్లు, పూలు సమర్పించి పూజలు చేశారు. గోవుల పట్ల అందరికీ ప్రేమ ఉండాలని, సంప్రదాయం ప్రకారం వేడుక నిర్వహించిన తీరు అందరినీ ఆకట్టుకుంది. ఆ వివరాలిలా.. మదనపల్లె మండలం ఇసుకనూతిపల్లెకు చెందిన వెంకటరమణ, ఉమాదేవి దంపతులకు ఇద్దరు కుమార్తెలు. 20 ఏళ్ల కిందట భర్త వెంకటరమణ అనారోగ్యంతో చనిపోయాడు. ఇంటి యజమాని చనిపోవడంతో ఇద్దరు ఆడబిడ్డలను పోషించేందుకు ఉమాదేవి కష్టాలు పడింది. ఆమె బాధలను గమనించిన ఓ సమీప బంధువు కుటుంబపోషణకు ఆధారంగా ఉంటుందని ఉమాదేవికి అప్పుగా ఓ పాడి ఆవును పట్టించాడు. ఆ ఆవును పెంచుకుంటూ, దాని నుంచి వచ్చిన పాలను అమ్ముకుంటూ ఇద్దరు బిడ్డలను పోషించుకుంటూ వచ్చింది. ఈ క్రమంలో ఆ ఆవు ఓ పెయ్యదూడకు జన్మనిచ్చి చనిపోయింది. తమ ఇంట పుట్టిన దూడను ఉమాదేవి అల్లారుముద్దుగా, కన్నబిడ్డలతో సమానంగా ఉమాదేవి చూసుకునేది. దూడ పెద్దదై మొదటి ఈతలో రోజుకు 13లీటర్ల వరకు పాలు ఇచ్చేది. ఈ పాలను అమ్ముకుంటూ వచ్చిన ఆదాయంతో మరో నాలుగు ఆవులను కొనుగోలు చేసిన ఉమాదేవి ఇద్దరు కుమార్తెలకు పెళ్లిళ్లు చేసి సొంతంగా ఇల్లు కట్టుకుంది. తన, కుటుంబ ఎదుగుదలకు మహాలక్ష్మిలా, తన ఇంట సిరులు కురిపించి పెద్దదిక్కుగా మారిన ఆవు లక్ష్మి రెండోసారి గర్భం దాల్చింది. దీంతో ఉమాదేవి ఐదునెలల గర్భిణి అయిన లక్ష్మికి వైభవంగా సీమంతం చేసింది. మంగళహారతులు పాడుతూ..వేదమంత్రాల మధ్య శాస్త్రోక్తంగా సీమంతం కార్యక్రమం నిర్వహించింది. ముత్తైదువలతో పాటు వచ్చిన బంధువులకు, చిన్నపిల్లలకు ఉమాదేవి విందు భోజనం వడ్డించింది.

నగరవనం ఏర్పాటు అభినందనీయం

– మాజీ ఎమ్మెల్యే డాక్టర్.దేశాయ్‌తిప్పారెడ్డి



నగరవనం నిర్వహణపై అటవీశాఖ అధికారులకు సూచనలిస్తున్న మాజీ ఎమ్మెల్యే దేశాయ్‌తిప్పారెడి

మదనపల్లె : పచ్చని ప్రకృతి అందాలమధ్య, కాలుష్యానికి దూరంగా ఆహ్లాదకర వాతావరణంలో పట్టణ ప్రజలు వాకింగ్ చేసేందుకు, ఆరోగ్యాన్ని పెంచుకునేందుకు వీలుగా అటవీశాఖ ఆధ్వర్యంలో నగరవనం ఏర్పాటు చేయడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్.దేశాయ్‌తిప్పారెడ్డి అన్నారు. పట్టణంలోని బసినికొండలో అటవీశాఖ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న నగరవనాన్ని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఆధ్వర్యంలో స్థానిక వైద్యులు, వాకర్స్ అసోసియేషన్ కమిటీ సభ్యులు సందర్శించారు. నగరవనం ఏర్పాటులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేయాల్సిన ఏర్పాట్లపై సలహాలు, సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్.దేశాయ్‌తిప్పారెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆహ్లాదం కోసం నగరవనాలు, ఎకోపార్కుల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. మదనపల్లెలో కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న నగరవనం ప్రజలందరినీ ఆకట్టుకునేలా అందంగా తీర్చిదిద్దాలన్నారు. నగరవనంలో అరుదైన వృక్షజాతులను, సుగంధ మొక్కలను పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వనంలో 100శాతం పచ్చదనం ఉండేలా, ప్రాజెక్టును త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. వాకింగ్ ట్రాక్‌ను తక్కువగా నిర్మిస్తున్నారని, దీనికి ప్రత్యామ్నాయంగా మరో ట్రాక్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. నగరవనం అభివృద్ధికి ఐఎంఏ, వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తమవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మదన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ..పట్టణానికి ఆనుకుని ఉన్న అటవీ భూముల్లో నగరవనాల ఏర్పాటుకు కేంద్రం కొంత మేర నిధులు సమకూరుస్తుండగా, వీటికి అదనంగా రాష్ట్రప్రభుత్వ సహకారంతో వనాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు అనిల్‌కుమార్‌రెడ్డి, రామలింగారెడ్డి, వెంకటరమణారెడ్డి, గోపీకృష్ణారెడ్డి, పీ.వి.ప్రశాంత్‌కుమార్, ఆనంద్‌కుమార్, సీటీఓ శ్రీనివాసులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

కేశాలు దానం చేసిన విద్యార్థిని

మదనపల్లె సిటీ: కేన్సర్ బాధితుల కోసం హెల్పింగ్ మైండ్స్ తలపెట్టిన హెయిర్ డొనేషన్ కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తోంది. ఇందులో భాగంగా ఆదివారం మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెకు చెందిన శ్రీనివాసులురెడ్డి, విమల దంపతుల కుమార్తె విష్ణుప్రియ తన పుట్టినరోజున హెల్పింగ్ మైండ్స్ కార్యాలయానికి వచ్చి స్వచ్ఛందంగా కేశాలను దానం చేశారు. నిర్వాహకురాలు అబూబకర్‌సిద్దిక్ వీరికి పూల మొక్కలను అందించి అభినందించారు. కార్యక్రమంలో హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు చాను, రెడ్డి,అమీన్, కిరణ్‌లు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన

పీలేరు : స్థానిక డీలక్స్ వీధిలోని అమృత ఆస్పత్రిలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి స్పందన లభించింది. డాక్టర్ ఎల్. కిరణ్ కుమార్‌రెడ్డి, డాక్టర్ సౌమ్యరెడ్డి సుమారు వంద మందికి ఉచిత పరీక్షలు నిర్వహించి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు.

వాసవి క్లబ్ సేవలు విస్తృతం చేస్తాం



పూజా మందిరాన్ని ప్రారంభిస్తున్న పాలకుర్తి గాయత్రి

పీలేరు రూరల్ : వాసవి క్లబ్ సేవలు విస్తృతం చేస్తామని వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ పాలకుర్తి గాయత్రి అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని శ్రీ విద్యా గణపతివాగ్దేవి పూజా మందిరం, ప్రభుత్వాస్పత్రిలో రెండు సిమెంట్ బల్లలు ప్రారంభించారు. శ్రీ రౌద్రాల అంకాలమ్మ (గంగమ్మ) గుడిలో వాటర్ ప్యూరిఫైర్‌ను ప్రారంభించారు. నెహ్రూబజార్‌లోని వాసవీకన్యకాపరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆర్యవైశ్య కల్యాణమండపంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ నిరుపేద ఆర్యవైశ్యులకు ఆర్థిక సాయం చేయడానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వాసవిక్లబ్, వాసవికపుల్స్, వాసవి క్లబ్ గ్రేటర్స్ నాయకులు బాలాజి, కృష్ణమూర్తి, అరవింద్‌బాబు, వెంకటేష్, సురేష్‌బాబు, ప్రభాకర్, శివప్రసాద్, నాగరాజు, జయచంద్ర, కూనా ప్రభాకర్, గోవర్ధన్, శివపనేష్, మహేందర్, శంకర్, నరసింహులు, మురళి, రవి, కొత్త కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్షణతో జిల్లాకు మంచిపేరు తేవాలి

– జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి



మాట్లాడుతున్న డీపీఓ ధనలక్ష్మి

కురబలకోట: సమగ్ర శిక్షణ పొందిన గ్రామ కార్యదర్శులు జిల్లాకు మంచి పేరు తేవాలని, తద్వారా గ్రామాల్లో ప్రగతి శీలకారకులు కావాలని జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి పేర్కొన్నారు. ఆరు రోజులుగా అంగళ్లు గోల్డన్ వ్యాలీ కళాశాలలో జిల్లా స్థాయిలో 112 మంది గ్రామ కార్యదర్శులకు జరిగిన మొదటి బ్యాచ్ రెసిడెన్సియల్ శిక్షణ ఆదివారం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీ దేశంలోనే తొలి వ్యవస్థ అని అన్నారు. గ్రామాలు బాగుంటే దేశం బాగుంటుందని గాంధీజీ ఏనాడో చెప్పాడన్నారు. పంచాయతీలకు సంబంధించి అన్ని విషయాలపై సమగ్ర శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ప్రజలు గుర్తించేలా విధి నిర్వహణలో కొత్త కార్యదర్శులుగా కొత్తదనం కన్పించాలన్నారు. ప్రభుత్వ లక్ష్యాల సాధనలో గ్రామ వికాసానికి పాటుపడుతూ ముందుకు సాగాలని గ్రామ కార్యదర్శులకు సూచించారు. అనంతరం మదనపల్లె డీఎల్‌పీఓ నాగరాజు మాట్లాడుతూ నేర్చుకున్న వాటిపై పని తీరు మెరుగుపరచుకుని గ్రామాల్లో మంచి పేరు, గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. మరో ప్రాంతానికి బదిలీ అయినా ఇతనే మాకు కావాలి అన్నంతగా ప్రజల నుంచి స్పందన వచ్చేలా మెరుగైన సేవలు ఉండాలన్నారు. ప్రజలతో కలసి మెలసి నడుచుకుంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించినప్పుడే ఇలాంటివి సాధ్యమవుతాయన్నారు. శిక్షణ ముందు తర్వాత అన్న విధంగా పనితనంలో తేడా కన్పించాలన్నారు. శిక్షణ ద్వారా మెరుగైన సేవలు అందించడానికి అవకాశం కల్గుతుందన్నారు. నిజాయితీ, నిబద్ధత, సమగ్ర నైపుణ్యం, సేవాదృక్పథంతో పనిచేసి ప్రజల్లో గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. సాంకేతికంగా కూడా నిపుణత సాధించాలన్నారు. గోల్డన్‌వ్యాలీ కళాశాల అధినేత ఎన్వీ రమణారెడ్డి మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ప్రతి అంశంపై కార్యదర్శులకు అవగాహన ఉండాలన్నారు. వివిధ శాఖలను సమన్వయ పరచుకుంటూ పది కాలాల పాటు గుర్తుండేలా ప్రజలకు సేవలందించాలన్నారు. మాస్టర్ ట్రైనర్లు ఎస్. అబ్దుల్ సుకూర్, ఎస్. నవాజ్, కె. శేషగిరికుమార్, బి. రాజశేఖర్ నాయక్, ఎస్. గఫూర్, ఎస్. గిరిధర్, పద్మారాణి, రెడ్డెప్ప, బయ్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు. శిక్షణ ముగిసిన గ్రామ కార్యదర్శులకు డీపీఓ, డీఎల్‌పీఓ ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. స్వామిత్వ పుస్తకాలను ఆవిష్కరించారు.

6న మదనపల్లెలో సీపీఐ బస్సుయాత్ర

మదనపల్లె : భారత కమ్యూనిస్ట్ పార్టీ(సీపీఐ) ఆధ్వర్యంలో రాష్ట్రాన్ని రక్షించుకుందాం-దేశాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న బస్సుయాత్ర ఈనెల 6న మదనపల్లెకు చేరుకుంటుందని రాష్ట్ర సమితి సభ్యులు తోపుకృష్ణప్ప తెలిపారు. ఆదివారం మండలంలోని సీటీఎంలో బస్సుయాత్ర వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణప్ప మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను రాష్ట్ర ప్రజానీకానికి తెలిపి, వారిని చైతన్యపరిచే ఉద్దేశంతో బస్సుయాత్ర నిర్వహిస్తున్నామన్నారు. ఆగస్టు 17న విశాఖపట్నం నుంచి ప్రారంభమైన సీపీఐ బస్సుయాత్ర రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తూ ఆరోతేదీన మదనపల్లెకు చేరుకుంటుందన్నారు.

ఇళ్లలో నుంచి బయటకు రాలేరు..పోలేరు



కాలువకు తీసిన గోతుల్లో నిలిచిన వర్షపు నీరు

కురబలకోట: ముందు చూపు లేని అధికారులతో కురబలకోట మండలంలోని చేనేతనగర్‌లో హైవే పక్కనున్న కాలనీ వాసులు ఇబ్బందులు పడ్డారు. ములకల చెరువు నుంచి మదనపల్లెకు వేగంగా ఫోర్‌వే పనులు సాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆ మార్గంలోని చేనేతనగర్‌లో సైడు కాలువ నిర్మాణానికి వారం క్రితం రెండు మీటర్లులోతుకు పైగా పొడవునా జేసీబీతో కాలువ తీశారు. వర్షాలు పడకపోవడంతో ఇళ్ల ముందు నిచ్చెనలు వేసుకుని రోడ్డు పక్క కాలనీ వాసులు రాకపోకలు సాగించే వారు. శనివారం రాత్రి ఉన్నపాటున వర్షంపడింది. సైడు కాలువ నిర్మాణానికి తీసిన గోతుల్లో పొడవునా రోడ్డు మట్టానికి నీళ్లు నిండిపోయాయి. ఇళ్లలోని వారు బయటకు రాలేక బయట వారు ఇళ్లలోకి రాలేని పరిస్థితి నెలకొంది. కాలువ ప్రవాహాన్ని తలపింపజేసింది. ఇబ్బందులు పడ్డారు. వారి రాకపోకలు స్తంభించాయి. దిక్కుతోచని పరిస్థితి. ఈ విషయమై హైవే డీఈ శివరాంను విచారించగా చేనేతనగర్‌లో సైడు కాలువ నిర్మాణానికి తీసిన కాలువలో నిలచిన నీటిని మరో కాలువకు మళ్లించినట్లు తెలిపారు.